క్లుప్తంగా

కాకానినగర్ రోడ్‌లో తప్పిన ప్రమాదం



డివైడర్‌ను ఢీ కొట్టిన లారీ

విశాఖ విద్య: షీలా నగర్ నుంచి ఎన్‌ఏడీ కొత్త రోడ్డు వైపు వస్తున్న లారీ సోమవారం కాకానినగర్ సిగ్నల్ వద్ద డివైడర్‌ను ఢీ కొట్టింది. ఆ సమయంలో రెండు వైపులా వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని స్థానికులు తెలిపారు. రోడ్డు దాటుతున్న ఆటోను తప్పించబోయి లారీ డివైడర్‌ను ఢీకొట్టింది. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసు సిబ్బంది ప్రమాదానికి గురైన లారీని క్రేన్ సహాయంతో వేరే ట్రాలీ ఎక్కించి తరలించారు. ఆ సమయంలో కాకాని నగర్ సిగ్నల్ నుంచి ఎన్‌ఏడీ కొత్త రోడ్డు ఫ్లైఓవర్ వరకు భారీగా ట్రాఫిక్ జామ్ అయింది.

సమస్యల పరిష్కారానికి కృషి



పిచ్చి మొక్కల తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింధియా: వార్డులోని అన్ని ప్రాంతాల్లో వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు అన్నారు. దీని కోసం క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నట్టు చెప్పారు. ఎన్టీఆర్‌కాలనీలో రోడ్డుకు అడ్డంగా పిచ్చి మొక్కలు పెరగడంతో పడుతున్న అవస్థలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన సోమవారం పొక్లెయిన్‌తో దగ్గరుండి పిచ్చి మొక్కలను తొలగించి రోడ్డును శుభ్రం చేయించారు. దీంతో స్థానికులు కార్పొరేటర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

17 నుంచి బాడీబిల్డింగ్ పోటీలు



బాడీ బిల్డింగ్ పోటీల బ్రోచర్ విడుదల చేస్తున్న నిర్వాహకులు

మల్కాపురం: ఈ నెల 17వ తేదీన నిర్వహించనున్న మిస్టర్ ఆంధ్ర బాడీబిల్డింగ్ పోటీల బ్రోచర్‌ను సోమవారం 59వ వార్డు నెహ్రూనగర్ వద్ద తెలుగు యువత నాయకుడు రామ్మోహన్‌నాయుడు విడుదల చేశారు. క్రీడాకారులకు తన వంతు ప్రోత్సాహం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ కార్మికుల గోడు పట్టదా!

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం, ఉక్కు యాజమాన్యాలు చెలగాటం ఆడుతున్నాయని స్టీల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రెండు నెలలుగా ఉక్కు ఉద్యోగులకు, ఆర్నెల్లుగా కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు సక్రమంగా చెల్లించడం లేదన్నారు. దసరా, దీపావళి పండగలకు జీతాలు చెల్లించకుండా కార్మికులకుటుంబాలను మానసిక క్షోభకు గురి చేశారన్నారు. కార్మికులకు రావాల్సిన పీఎఫ్ ఫండ్ రూ. 400 కోట్లు, థ్రిఫ్ట్ లోన్ రికవరీ రూ. 70 కోట్లు, సూపర్ యాన్యుయేషన్ బెనిఫిట్ ఫండ్ రూ. 100 కోట్లు, జీతభత్యాలు రూ. 300 కోట్లు, చనిపోయిన కార్మికులకు సంబంధించిన రూ. 40 కోట్లు వెరసి సుమారు వెయ్యి కోట్లు యాజమాన్యంవద్ద ఉంచుకున్నారన్నారు. కార్మికులకు జీతాలు చెల్లించకుండా ఆ సొమ్ముతో రామెటీరియల్ కొంటున్నారన్నారు. ఇంత దౌర్భాగ్యపరిస్థితిని గడిచిన 40 ఏళ్లలో ఎన్నడూ చూడలేదన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే కుటుంబాలతో రోడ్డెక్కి ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు.

శంభో శంకర



శివలింగానికి పూజలు చేస్తున్న అర్చకుడు



శివుడికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు



శివనామస్మరణ చేస్తున్న మహిళలు



రెడ్డివీధి శివాలయంలో శివునికి అభిషేకం

మల్కాపురం: కార్తీకమాసం తొలి సోమవారం కావడంతో పారిశ్రామిక ప్రాంతంలోని పలు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల ప్రాంగణం అంతా శివనామస్మరణతో మార్మోగాయి.

● ఐవోసీ చింతామణి దుర్గాగణపతి ఆలయంలో కొలువుదీరిన భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామికి ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు చేశారు.విభూది,బిల్వపత్రాలతో అర్చనలు జరిపారు. అనంతరం భక్తులకు అర్చకులు ప్రసాదాలు అందించారు.

● మల్కాపురం రెడ్డివీధి వద్ద గల శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రకాష్‌నగర్,శ్రీహరిపురం,గణపతినగర్ ప్రాంతాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు,అభిషేకాలు జరిపారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధి షిప్‌యార్డ్ కాలనీని శివాలయంలో కార్తీకమాసం తొలిసోమవారం పర్వదినాన్ని పురస్కరించుకుని 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, 63వ వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నాలు పరమశివునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. కార్పొరేటర్లకు ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీను పంతులు స్వాగతం పలికి శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అభివృద్ధికి మరింత తోడ్పడతామని కార్పొరేటర్లు అన్నారు.

● జీవీఎంసీ 62వ వార్డు పరిధి ప్రకాష్‌నగర్, త్రినాథపురం తదితర ప్రాంతాల్లోని ప్రముఖ శివాలయాల్లో వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ప్రత్యేక పూజలు జరిపారు. ముందుగా స్వామి వారికి క్షీరాభిషేకం, బిల్వపత్రార్చన, రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలోరామకృష్ణ, నక్కా సూర్యనారాయణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కంచరపాలెం: కార్తీక మాస మొదటి సోమవారం పుస్కరించుకుని కంచరపాలెం, ఊర్వశికూడలి, ఐటీఐ జంక్షన్‌లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రామ్మూర్తిపంతులపేట పరిధిలోని రామలింగేశ్వరాలయంలో శివునికి వేకువ జాము నుంచే భక్తులు అభిషేకాలు చేశారు. కె.కాలనీ సాంబమూర్తినగర్‌లో చంద్రమౌళీ పార్వతీ ఆలయంలో అర్చకుడు పి.రాజేష్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు. గవర కంచరపాలెం గౌరీ శంకరాలయం, ఐటీఐ కూడలి తుమ్మడపాలెం ఆత్మలింగేశ్వర ఆలయంలో తెల్లవారు జామున నాలుగు గంటల నుంచి భక్తుల రద్దీ నెలకొంది. సాయంత్రం గంట స్తంభాల వద్ద దీపారాధన చేశారు.



గవరవీధిలో గౌరీ పరమేశ్వరులు



షిప్‌యార్డ్‌కాలనీ శివాలయంలో పూజలు చేస్తున్న కార్పొరేటర్లు నాగేశ్వరరావు, చిన్నా

విశాఖ విద్య: కార్తీక మాసం తొలిసోమవారం శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్‌ఏడీ సెంటర్‌లోని శివాలయం, సుసర్లకాలనీ చంద్రమౌళీశ్వర స్వామి ఆలయం, గవర వీధిలోని గౌరీ పరమేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాలను దర్శించుకొని కార్తీక దీపాలు వెలిగించారు.



గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్న భక్తులు



సుసర్ల కాలనీలో పూజలు అందుకున్న చంద్రమౌళీశ్వర స్వామి



62వ వార్డులోని శివాలయంలో పూజలు చేస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

కార్తీక నోము పూజలు చేసిన భక్తులు తిరిగి సాయంత్రం శివాలయాలను దర్శించుకున్నారు.

కార్మికులకు అండగా మస్తానప్ప

సింధియా: స్టీల్ వైఎస్సార్ టీయూసీ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప అకాల మరణం బాధాకరమని హిందూస్థాన్ షిప్‌యార్డ్ వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు విచారం వ్యక్తం చేశారు. సంస్థ ఆవరణలోని వైఎస్సార్‌టీయూసీ కార్యాలయంలో మస్తానప్ప చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మస్తానప్ప నాయకత్వంలో ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు చేస్తున్న నిరసన తారాస్థాయికి చేరిందన్నారు. కార్మికులను సంఘటితం చేయడంలో మస్తానప్ప సేవలు మరవలేనివని కొనియాడారు.



మస్తానప్ప చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్మికులు

కార్యక్రమంలో షిప్‌యార్డ్ వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

కనకరాజుకు ఘన సత్కారం



కనకరాజును సత్కరిస్తున్న నాయకులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు ఇందిరాకాలనీ ప్రాంతానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఆకుల కనకరాజును సోమవారం సీనియర్ సిటిజన్స్ ఘనంగా సత్కరించారు. 65 ఏళ్ల వయసులోనూ 600 మీటర్ల పరుగు పందెంలో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచారు. ఇటీవల కోల్‌కతాలో సీనియర్ సిటిజన్స్ స్థాయిలో (60 నుంచి 70) ఏళ్ల లోపు వారికి నిర్వహించిన 600 మీటర్ల పరుగు పందెంలో మంచి ప్రతిభ చూపారు.అందుకు గానూ స్థానిక సీనియర్ సిటిజన్స్ ఆయన్ను సన్మానించారు. మరిన్ని విజయాలు సాధించాలని వారంతా ఆకాంక్షించారు.

అలరించిన ‘వినోదాల విందు’



స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట : ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన ‘వినోదాల విందు’ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించింది. క్లబ్ వ్యవస్థాపకుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో కళాకారులు జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్‌రాజు, కుమారి, చిదంబరం, శివజ్యోతి, భాను ప్రకాష్, నాయుడు, పోర్టు శేషు, ఇమంది ఈశ్వరరావు, సీత తదితరులు కామెడీ స్కిట్స్ ప్రదర్శించారు. వీటిలో స్టంట్ మాస్టర్, జ్యోతిష్యం, థమ్సప్ రికార్డు, చికెన్ 65, ఐదు వందల రూపాయల అప్పు, డాక్టర్ బర్త్‌డే గిఫ్ట్, హోటల్ రూం , మెడ పట్టేసింది స్కిట్స్ ఆహూతులను నవ్వుల్లో ముంచెత్తాయి. కార్యక్రమంలో భాగంగా హరిహర నృత్య నికేతన్ నాట్య గురువు అల్లు వెంకటరమణ పర్యవేక్షణలో అల్లు అనూష, కోట అనూష, మామిడిశెట్టి హృతిక, కోరాడ గాయత్రి ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. నంది అవార్డు గ్రహీత వంకాయల మారుతీ ప్రసాద్‌కు కలియుగ వీరబాహుడు బిరుదును తిలక్ పట్నాయక్, సన్ మూర్తి, కోన మహేష్, దాడి సత్యనారాయణ చేతుల మీదుగా ప్రదానం చేశారు.

హుండీలో నగదు చోరీ

విశాఖ విద్య: చంద్రనగర్‌లోని శ్రీ పరదేశమ్మ ఆలయ హుండీలో నగదు చోరీకి గురైంది. ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచేందుకు వెళ్లిన అర్చకులు హుండీలో నగదు చోరీ అయినట్టు గుర్తించారు. హుండీ తాళాలు పగులగొట్టి అందులో ఉన్న నగదును తస్కరించారు. దీనిపై గోపాలపట్నం క్రైం పోలీసులకు ఆలయ కమిటీ సభ్యులు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా ప్రదేశాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంధకారంలో గొందేశివానిపాలెం రోడ్డు

ఫోకస్

నిత్యం ఆ మార్గం వాహనదారులతో రద్దీగా ఉంటుంది. సుమారు 6 గ్రామాల ప్రజలు ఆ రోడ్డు గుండా వివిధ ప్రాంతాలకు చేరుకుంటారు. అలాంటి మార్గంలో రాత్రి అయితే చాలు అంధకారమే. ఈ మార్గానికి ఇరు వైపులా వేసిన విద్యుత్ లైట్లు వెలగడం లేదు. ఇదీ 58వ వార్డు శివారు ప్రాంతంలోని గొందేశివానిపాలెం రోడ్డులో పరిస్థితి. విశాలంగా ఉండే ఈ మార్గం ద్వారా పిలకవానిపాలెం ,ములగాడ,చిన్నములగాడ,ఎదురవానిపాలెం తదితర ప్రాంతాల వాసులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే వీధి లైట్లు వెలగక పోవడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. వీధిలైట్ల సమస్యను జీవీఎంసీ అధికారులకు తెలిపినా ఫలితం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. -మల్కాపురం



950 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

అగనంపూడి: అక్రమంగా తరలిస్తున్న 950 కిలోల రేషన్ బియ్యాన్ని దువ్వాడ పోలీసులు పట్టుకొని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 87వ వార్డు అప్పికొండ కాలనీలో నివాసం ఉంటున్న కె.వెంకటరమణ తన సమీప బంధువైన తూర్పుగోదావరి జిల్లా తుని మండలం కత్తిపూడి గ్రామానికి చెందిన సుబ్బారావుతో కలిసి పీడీఎస్ రైస్‌ను ఇళ్ల వద్ద కేజీ రూ.15కే కొనుగోలు చేసి ఎక్కువ ధరకు సబ్బవరంలో రైస్ మిల్లులకు తరలించేవాడని తెలిపారు. దీనిపై వచ్చిన సమాచారంతో దువ్వాడ పోలీసులు అప్పికొండలో ఆటోలో బియ్యం లోడ్ చేస్తుండగా ఆటోతో పాటు బియ్యం బస్తాలను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుకున్న బియ్యాన్ని ఏఎస్‌వోకు అప్పగించనున్నట్లు తెలిపారు. బియ్యం తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు.



స్వాధీనం చేసుకున్న పీడీఎస్ రైస్

రైల్వే ప్రయాణికుల అష్టకష్టాలు!

- స్టేషన్‌కు వెళ్లే రోడ్డులో అడ్డంగా దుకాణాలు
- బీఆర్టీఎస్ రోడ్డు దాటాలంటే భయం భయం
- పట్టించుకోని జీవీఎంసీ, ట్రాఫిక్ అధికారులు



సింహాచలం రైల్వే స్టేషన్



దుకాణాలతో ఇరుగ్గా మారిన రైల్వేస్టేషన్ రోడ్డు

విశాఖవిద్య: సింహాచలం రైల్వే స్టేషన్‌లో దిగిన ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. రైల్వే స్టేషన్ నుంచి ఎన్‌ఏడీ- పెందుర్తి బీఆర్టీఎస్ రహదారి మీదకు రావాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సిందేని ప్రయాణికులు అంటున్నారు. రైల్వే స్టేషన్ నుంచి బీఆర్టీఎస్ రోడ్‌కు వచ్చే దారిని కొంతమంది వ్యాపారులు ఆక్రమించేశారు. రోడ్డుపైనే దుకాణాలు నిర్వహిస్తుండడంతో ఆ దారిలో ప్రయాణం అసౌకర్యంగా ఉంటుందని ప్రయాణికులు చెబుతున్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా ప్రస్తుతం డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నారు. కానీ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ దుకాణాలను ఏమాత్రం వెనక్కి జరపకుండా నిర్మాణం చేయడంతో రోడ్డు కుదించుకుపోతుందని ప్రయాణికులు చెబుతున్నారు.

బస్సు ఎక్కాలంటే భయం భయం

రైలు దిగి బీఆర్టీఎస్ వరకు వచ్చి అక్కడ ఆర్టీసీ బస్సు ఎక్కాలంటే భయం భయంగా ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. రైల్వే స్టేషన్ నుంచి ప్రతీ రోజూ వందలాది మంది చుట్టు పక్కల ప్రాంతాలకు ప్రయాణం సాగిస్తారు. దూర ప్రాంతాల నుంచి సింహాచలం దేవస్థానానికి వచ్చే వారు కూడా ఇక్కడే రైలు దిగి వెళ్తారు. బస్సుల కోసం వేచి ఉండే చోట కనీసం చిన్న పాటి షెల్టర్ కూడా ఏర్పాటు చేయకపోవడం శోచనీయం. ఎండైనా.. వానైనా రోడ్డుపైనే నిలబడి బస్సులు ఎక్కాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు వెడల్పు ఎందుకు తగ్గిందో !

ఎన్‌ఏడీ నుంచి పెందుర్తి వరకు బీఆర్టీఎస్‌రోడ్డు ఒకలా ఉంటే.. రైల్వే స్టేషన్ ఏరియాలో మాత్రం ఇరుగ్గా ఉంది. అటు, ఇటు వంద అడుగులు ఉంటే, ఇక్కడ మాత్రం 60 అడుగుల మాత్రమే ఎందుకు నిర్మించారని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. దీని వెనుక ఉన్న కారణాలేంటనేది కలెక్టర్ స్థాయి అధికారులు ఓ సారి పరిశీలన చేయాల్సి ఉందని చెబుతున్నారు. భవిష్యత్‌లో సింహాచలం రైల్వే స్టేషన్ నుంచి మరింత మంది రాకపోకలు సాగించే అవకాశం ఉంది. ఈ నేథప్యంలో ఇక్కడ నెలకొన్న సమస్యలపై జీవీఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బస్సు ఎక్కేందుకు నీడలేకపోవడంతో రోడ్డుపై ప్రయాణికులు

నైపుణ్య గణనపై శిక్షణ

గాజువాక: వచ్చే వారం నుంచి గాజువాక జోన్‌లో నైపుణ్య గణన ప్రారంభమవుతుందని జోనల్ కమిషనర్ శేషాద్రి చెప్పారు. కార్యక్రమంలో పాల్గొననున్న ఎన్యూమరేటర్లకు సోమవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 15 ఏళ్ల నుంచి 59 ఏళ్ల వ్యక్తులకు సంబంధించిన విద్యార్హతలు, ఉద్యోగ అనుభవం, వారి ఉద్యోగ ఆసక్తులను సేకరించాల్సి ఉంటుందన్నారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించిందన్నారు. సచివాలయాన్ని యూనిట్‌గా తీసుకొని దాని పరిధిలో జనావాసాలను క్లస్టర్‌గా విభజిస్తామన్నారు. ఒక్కో క్లస్టర్‌కు ఒక ఎన్యూమరేటర్‌ను నియమించి సర్వే నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ప్రతి ఎన్యూమరేటర్‌కు నిర్దిష్ట కుటుంబాలను మ్యాపింగ్ చేస్తామని చెప్పారు. అనంతరం స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం నిపుణుడు దేవీ గణేష్ మురళి ఎన్యూమరేటర్లకు శిక్షణ నిర్వహించారు. యాప్ పనితీరును, సేకరించాల్సిన వివరాలను తెలిపారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ సిబ్బంది కమలాకర్, రామేశ్వరి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్సీ శేషాద్రి

మార్కెట్‌లో నాగుల చవితి సందడి

కంచరపాలెం : కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, మర్రిపాలెం, జ్ఞానాపురం, తాటిచెట్లపాలెం తదితర ప్రాంతాల్లో మార్కెట్లు నాగులచవితి సామగ్రి కొనుగోలు చేసే వినియోగదారులతో సోమవారం కళకళలాడాయి. మంగళవారం నాగుల చవితి వేడుకకు కంచరపాలెం పరిసర ప్రాంతాల్లో పుట్టలు సిద్ధం చేశారు. ఇందుకోసం కొబ్బరికాయలు, అరటిపండ్లు, పువ్వులు, పత్రి, నువ్వులు, తాటిటెంకలు తదితర సామగ్రికి డిమాండ్ ఉండడంతో వ్యాపారులు అధిక ధరలకు విక్రయించారు. వీటి ధరలు ఎక్కువగా ఉండడంతో వినియోగదారులు తప్పనిసరి పరిస్థితుల్లో కొనుగోలు చేశారు. కంచరపాలెంలో బీఆర్‌టీఎస్ రహదారికి ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేయడంతో వారిని ఫ్లైఓవర్ వంతెనపైకి తరలించారు. సాయంత్రం రహదారులన్నీ వినియోగదారులు, వ్యాపారులతో రద్దీగా కనిపించాయి. వాహనాల రాకపోకలను ఐదో పట్టణ ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది నియంత్రించారు.



కంచరపాలెం రైతుబజారులో వినియోగదారులు

వీఆర్‌ఏలకు పే స్కేల్ అమలు చేయాలి

జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకటరావు

సీతమ్మధార: తమకు పే స్కేల్ అమలు చేయాలని గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏ) జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. వీఆర్ఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన వ్యక్తం చేశారు. తక్షణం కూటమి ప్రభుత్వం వీఆర్ఏలకు పేస్కేల్ అమలు చేయాలని, పదోన్నతులు కల్పించాలని, నామిని వీఆర్‌ఏలను గ్రామ రెవెన్యూ సహాయకులుగా (వీఆర్ఏ) గుర్తించాలని, తెలంగాణ రాష్ట్రంలో మాదిరిగా జీతాలు చెల్లించాలని నినాదాలు చేశారు. వీఆర్‌ఏల విశాఖ జిల్లా గౌరవాధ్యక్షుడు పి.వెంకటరావు మాట్లాడుతూ జిల్లాల విభజన జరిగిన తర్వాత కొత్త కలెక్టర్ ఆఫీసులో, ఆర్డీవో ఆఫీస్‌లో ఖాళీలు ఏర్పడ్డాయన్నారు. అటెండర్, వాచ్‌మన్, డ్రైవర్ పోస్టులు ఖాళీలు ఉన్నప్పటికీ అర్హత ఉన్న వారికి పదోన్నతులు ఇవ్వడం లేదన్నారు. పార్ట్ టైం ఉద్యోగులైన వీఆర్‌ఏల జాబ్స్ చార్ట్ ప్రకారం డ్యూటీలు కాకుండా మండల ఆఫీసులలో నైట్ వాచ్‌మన్ డ్యూటీ వేస్తున్నారని, ఇతర డ్యూటీలకు కూడా పిలుస్తున్నారని తక్షణం వాటిని రద్దు చేయాలన్నారు. ఈ నెల 18వ తేదీలోగా వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించకుంటే చలో సీసీఎల్‌ఏ ఆఫీసు ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో 50 మంది వీఆర్‌ఏలు పాల్గొన్నారు.



జీవీఎంసీ గాంధీ గాంధీ పార్కు ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు